BREAKING EDITION
బ్రేకింగ్ ఎడిషన్

Follow: @ANNTELUGU

మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ 19-02-2025

WWW.EPAPER.MAHAADAILY.COM

ANN తెలుగు

శివాజీ జీవితం స్ఫూర్తిదాయకం

ఛత్రపతి శివాజీకి సీఎం రేవంత్ రెడ్డి పుష్పాంజలి

మహా, హైదరాబాద్: భారతదేశానికి అపారమైన సేవలు అందించిన శివాజీ మహారాజ్ వీరత్వం, పరిపాలనా నైపుణ్యం స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... వీరత్వం, దూరదృష్టి నాయకత్వం దేశ ఐకమత్యానికి పునాది వేసిందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు వాకాటి శ్రీహరి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తదితరులు పాల్గొని శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు, పరిపాలనా విధానాలు నేటి తరానికి మార్గదర్శకంగా ఉంటాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల సేవలో ప్రతి నాయకుడు పనిచేయాలని నేతలు సంకల్పం వ్యక్తం చేశారు.

సారొచ్చారు..

తెలంగాణ భవన్‌కు కేసీఆర్

పెద్ద ఎత్తున తరలి వచ్చిన కార్యకర్తలు

పార్టీ క్యాడర్‌లో నూతనోత్సాహం

పాస్‌పోర్టు ఆఫీసుకు కేసీఆర్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయానికి వచ్చారు. బుధవారం ఉదయం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి తన సతీమణితో కలిసి కేసీఆర్ పాస్‌పోర్టు ఆఫీసు వచ్చారు. తన పాస్‌పోర్టును రెన్యూవల్ చేసుకున్నట్లు తెలుస్తోంది. డిప్లమాటిక్ పాస్‌పోర్టును సబ్‌మిట్ చేసి సాధారణ పాస్‌పోర్టును తీసుకునేందుకు కేసీఆర్ పాస్‌పోర్టు కార్యాలయానికి వచ్చారని అధికార వర్గాలు చెబుతున్నాయి. కేసీఆర్‌తో పాటు సతీమణి, జోగినపల్లి సంతోష్ ఆఫీస్‌లోకి వెళ్లారు. దాదాపు అరగంట పాటు రెన్యూవల్ ప్రాసెస్ జరిగింది. పాస్‌పోర్టు రెన్యూవల్ అనంతరం కేసీఆర్ నందినగర్‌లోని నివాసానికి బయలుదేరి వెళ్లారు.

మహా, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చాలా నెలల తర్వాత బుధవారం తెలంగాణ భవన్‌కు వచ్చారు. సుమారు ఏడు నెలల తర్వాత ఆయన తెలంగాణ భవన్ లో అడుగు పెట్టారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎలక్షన్స్‌లో ఓటమితో ఆయన ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. మధ్యలో ఇంట్లో జారి పడటంతో ఆయన హాస్పిటల్ పాలయ్యారు. కొన్నేళ్ల చికిత్స తర్వాత మళ్లీ ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు. ఫామ్ హౌస్ లో ఉంటున్న పార్టీ తరుపున కేటీఆర్, హరీశ్ రావు యాక్టివ్ గా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగడుతున్నారు.

కాసేపట్లో రాష్ట్ర కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశం

తాజాగా బుధవారం గులాబీ పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించే పార్టీ రాష్ట్ర కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశానికి కేసీఆర్ హాజరై కార్యకర్తలకు దిశా నిర్ధేశం చేయనున్నారు. కేసీఆర్ అధ్యక్షతన కొనసాగనున్న ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గం, పార్టీ జిల్లాల అధ్యక్షులు, మాజీ ఎంపీలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, జడ్పీ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు తరలివచ్చారు. మొన్న బర్త్ డే తర్వాత రెండు రోజులకే కేసీఆర్ వస్తూ ఉండటంతో ఈ భేటిపై ఆసక్తి నెలకొంది. అంతేకాదు రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న విధానాలు. .ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో తీసుకెళ్లాల కార్యకర్తలకు దిశా నిర్ధేశం చేయనున్నారు. అటు కేంద్రంపై ఎలాంటి వ్యూహం అమలు చేయాలనే దానిపై కూడా కార్యచరణ రూపొందించినట్టు తెలుస్తుంది.

సర్వత్రా ఆసక్తి..

చాలా నెలల తర్వాత కేసీఆర్ అధ్యక్షతన మీటింగ్ జరుగుతూ ఉండటంతో అందరిలోనూ ఆసక్తి నెలకొంది. అంతేకాదు కేసీఆర్ రాకతో పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపే ప్రయత్నం చేస్తున్నారు. రైతులు, ప్రజా సమస్యలపై పోరాటానికి సంబంధించి ఈ సమావేశంలో చర్చించనున్నారు. అలాగే గతంలో ప్రకటించినట్లే భారీ బహిరంగ సభతో పాటు పార్టీ కార్యక్రమాలపై ప్రత్యేకంగా కేసీఆర్ నేతలకు సూచనలు ఇవ్వనున్నారు.

తెలంగాణలో హిందువులది

బిచ్చపుబతుకు

కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు

మహా, మంచిర్యాల: తెలంగాణలో హిందువులది బిచ్చపు బతుకైందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అసలు కాంగ్రెస్ పార్టీ నాయకులు హిందువులేనా?.. వారిలో ప్రవహిస్తుంది హిందూ రక్తమేనా? అని ప్రశ్నించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ప్రచారంలో భాగంగా బుధవారం మంచిర్యాల నియోజకవర్గంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో బండి సంజయ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం ఉద్యోగులకు రంజాన్ సందర్భంగా సాయంత్రం నాలుగు గంటలకు ఇళ్లకు వెళ్ళవచ్చని ప్రత్యేక వెసులుబాటు ఇచ్చిందని.. అదే అయ్యప్ప మాల, శివ మాల, ఆంజనేయ స్వామి, భవానీ మాల వేసుకున్న వారికి ఎందుకు వెసులుబాటు ఇవ్వడం లేదని? బండి సంజయ్ ప్రశ్నించారు. అయ్యప్ప దీక్షా పరులైన ఉద్యోగులు సొంతంగా వంట చేసుకుని తినాలని.. వారు అందుకోసం బయటకు వెళితే ఎక్కడ ఉద్యోగాల్లో పై అధికారులు చర్యలు తీసుకుంటారేమోనన్న భయంతో పస్తులుంటున్నారని.. వారికి కూడా ముస్లింలకు ఇచ్చినట్లుగా ఎందుకు వెసులుబాటు ఇవ్వరని నిలదీశారు. కాంగ్రెస్ పాలనలో చట్టం అందరికీ సమానం కాదా? ఒక వర్గం వారికి మాత్రం ఉపశమనాలు, మినహాయింపులు ఇవ్వడం ఎంత వరకు సబబు? అని ప్రశ్నించారు. అందరినీ సమదృష్టితో చూడాల్సిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక వర్గమంటే ఎందుకు వివక్ష? అని విమర్శించారు.

ప్రశ్నిస్తే మతతత్వ వాదులుగా ముద్ర

ఈ వివక్షపై ప్రశ్నిస్తే మమ్మల్ని మతతత్వ వాదులంటారన్నారని బండి సంజయ్ వాపోయారు. తబ్లిక్ జమైతే ఇస్లాం ఉగ్రవాద ప్రేరేపిత సంస్థకు వికారాబాద్ లో సమావేశం పెట్టుకుంటే ఈ ప్రభుత్వం రెండున్నర కోట్ల రూపాయాలు ఇచ్చారని..దీనిపై కాంగ్రెస్ నాయకులు ఏం సమాధానం చెబుతారన్నారు. సూడో సెక్యులరీజం..మైనార్టీ సంతుష్టీకరణ.. ఓటు బ్యాంకు రాజకీయాలతో కాంగ్రెస్ హిందువులకే కాదు.. దేశానికి కూడా ప్రమాదకరంగా మారిందని.. ఇప్పుడు కులాల పేరుతో రాజకీయానికి తెరలేపిందని విమర్శించారు.

వనపర్తి జిల్లాలో బర్డ్ ఫ్లూ ..

4 వేల కోళ్లు మృతి..సర్వత్రా కలకలం

మహా, వనపర్తి: వనపర్తి జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం రేపుతోంది. మదనాపురం మండలం కొన్నూరులో ఓ రైతుకు చెందిన కోళ్ల ఫామ్‌లో సుమారు 4వేల కోళ్లు మృత్యువాతపడ్డాయి. బర్డ్ ఫ్లూ వ్యాధితో కోళ్లు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఎప్పటి లాగే బుధవారం ఉదయం రైతు కోళ్లఫామ్‌కు వచ్చి చూడగా వేల సంఖ్యలో కోళ్లు చనిపోయి కనిపించాయి. దీంతో వాటిని గుంతలో పూడ్చిపెట్టారు. కోళ్ల మృతిపై వెటర్నరీ అధికారులకు రైతు సమాచారం ఇచ్చాడు. అయితే అధికారులు పట్టించుకోకపోవడంతో రైతు ఆగ్రహం వ్యక్తం చేశాడు. వేల కోళ్లు చనిపోవడానికి కారణం ఏమిటో అధికారులు చెప్పాలని.. తనకు న్యాయం చేయాలని కోరారు. బర్డ్ ఫ్లూ వల్లే కోళ్లు చనిపోయాయని అనుకుంటున్నామని.. దానిపై అధికారులు నిర్ధారణ చేయాలన్నారు. ప్రతీసారి తనకు కోళ్లపై లాభం వచ్చేదని.. కానీ ఈసారి మాత్రం పూర్తి నష్టపోయాయనని న్యాయం చేయాలని రైతు కోరుతున్నారు. కోళ్ల ఫామ్‌లో రెండు మూడు రోజులుగా కోళ్లు మృత్యువాత పడుతున్నాయని రైతు తెలిపారు. అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడంలేదన్నారు. సమీపంలో ఉన్న పౌల్ట్రీ రైతులు కూడా ఆందోళనకు గురవుతున్నారు.

కాటేసిన తీగలు

శివాజీ జయంతి వేడుకల్లో విద్యుత్ షాక్

ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం

మరో ఆరుగురికి తీవ్ర గాయాలు

జెండా ఆవిష్కరణలో అపశ్రుతి

సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాద ఘటన

మహా, హైదరాబాద్: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా జెండా ఆవిష్కరణ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్ తగిలి ఒకరు మృతి చెందారు. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం జబ్బపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. జెండా ఆవిష్కరణలో కరెంట్ షాక్ తగిలి లింగ ప్రసాద్ (23) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వద్దే కరుణాకర్ (25) అనే యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఆరుగురికి తీవ్ర గాయాలుకాగా గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. జెండా ఆవిష్కరించే క్రమంలో జెండా పైప్ విద్యుత్ వైర్లకు తగలడంతో విద్యుత్తు షాక్‌కు దారితీసిందని తెలుస్తోంది. ప్రమాదంలో విద్యుత్తు షాక్ తో ఒకరు మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన ఏడుగురిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. చత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు దేశ వ్యాప్తంగా హిందు సంస్థలు, యువజన సంఘాలు, రాజకీయ పార్టీలు ఘనంగా జరుపుకొంటున్నాయి. ఈ క్రమంలో జబ్బపూర్ లో సైతం శివాజీ జయంతి వేడుకలు నిర్వహిస్తుండగా...విద్యుత్తు షాక్ ప్రమాదం చోటుచేసుకోవడం బాధితుల కుటుంబాలను విషాదానికి గురి చేసింది. పోలీసులు తక్షణ సహాయక చర్యలు చేపట్టి మరింత ప్రాణనష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టారు.